క్లుప్తంగా

శాస్త్రోక్తంగా శ్రీవారి కల్యాణం



స్వామివారి కల్యాణం చేస్తున్న అర్చకులు

రాపూరు: మండలంలోని పెంచలకోనలో శనివారం పెనుశిల లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మీ, చెంచులక్ష్మీ కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం మూలమూర్తికి అభిషేకం, పూలంగిసేవ నిర్వహించారు. 10 గంటలకు స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను నిత్యకల్యాణ మండపంలో కొలువు దీర్చి విశేషాలంకరణ చేశారు. అనంతరం వేద మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ కల్యాణం నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు ఊంజల్ సేవ చేశారు.

సద్వినియోగం చేసుకోవాలి

సూళ్లూరుపేట రూరల్: ప్రభుత్వం ఉద్యాన పంటలపై అనేక రాయితీలు ఇస్తుందని ఉద్యానవన శాఖ అధికారి వై.యామిని తెలిపారు. ఆమె మాట్లాడుతూ పండ్ల తోటలు, కూరగాయలు, పూల సాగు చేసే రైతులకు సబ్సిడీ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. మామిడి సాగుకు హెక్టార్‌కు రూ.7,980, నిమ్మకు రూ.9,602, జామకు రూ.17,599, డ్రాగన్ ఫ్రూట్‌కు రూ.30 వేలు, కూరగాయల సాగుకు రూ.20 వేలు రాయితీ ఇస్తుందన్నారు. తీగజాతి కూరగాయల సాగు లో పందిళ్ల నిర్మాణానికి రూ. 16వేలు అందుతుందన్నారు. 16 లీటర్లు సామర్థ్యం కలిగిన తైవాన్ స్ప్రేయర్‌కు రూ. 8వేలు రాయితీ ఇస్తున్నట్లు పేర్కొన్నారు.

ఎంఈఓ కార్యాలయానికి కలశాలు



ఎంఈఓ కార్యాలయం వద్ద మట్టి కలశాలు

దక్కిలి: మండలంలోని అన్ని ప్రాథమిక పాఠశాలలు, హైస్కూళ్లలో హెచ్‌ఎంలు సేకరించిన మట్టిని కలశాలలో నింపి, ఎంఈఓ కార్యాలయానికి చేర్చారు. ఎంఈఓ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అజాదీకా అమృత్ మహోత్సవం కార్యక్రమంలో భాగంగా కలశాలను ఈ నెల 2వ తేదీన తిరుపతి డీఈఓ కార్యాలయానికి తరలించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎంలు భాస్కర్, వీరవాణి, చెంచుసుబ్బయ్య, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు పిగిలాం విద్యార్థిని



విద్యార్థిని శ్రీజను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

దక్కిలి (బాలాయపల్లె): స్కూల్ గేమ్స్ రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు బాలాయపల్లె మండలం పిగిలాం హైస్కూల్‌లో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థిని ఎం శ్రీజ ఎంపికయ్యారని ఆ పాఠశాల హెచ్‌ఎం లక్ష్మీనారాయణ తెలిపారు. నెల్లూరులో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ చూపడంతో రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు చెప్పారు. శనివారం శ్రీజకు అభినందన సభ ఏర్పాటు చేశారు. పీఈటీ శోభన్‌ను కూడా అభినందించారు.

మత్స్యకారులకు తీపి కబురు

చిల్లకూరు: సముద్రంలో చేపలు వేటకు వెళ్లే మత్స్యకారులకు రాష్ట్ర ప్రభుత్వం మత్స్యశాఖ ద్వారా తీపి కబురు అందిస్తుందని చిల్లకూరు మత్స్యశాఖాధికారి రఘుబాబు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ మండలంలోని తీర ప్రాంత గ్రామాల్లో బోటు లైసెన్స్ ఉన్న 50 మందికి అర్హత ఆధారంగా బోట్లు, వలలు, ఇంజిన్లు రాయితీపై అందించేందుకు సిద్ధంగా ఉందన్నారు. వేటకు వెళ్లిన సందర్భంలో మత్స్యకారులకు సముద్రంలో ఏదైనా ప్రమాదం జరిగితే రూ.10 లక్షల వరకు ప్రమాద బీమా కల్పిస్తుందన్నారు. మత్స్యకారులకు ఇచ్చే బోట్లు, వలలు, ఇంజిన్ల యూనిట్ విలువ రూ.5 లక్షలు కాగా మత్స్యకారులు 25 శాతం మాత్రమే చెల్లిస్తే మిగిలిన 75 శాతం ప్రభుత్వమే భరిస్తుందని తెలిపారు. అలాగే చెరువుల సొసైటీల ద్వారా ఉన్న ఎస్సీ, ఎస్టీ, మత్స్యకారులకు కూడా ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఆయన తెలిపారు.

దారి చూపాలని వినతి

చిల్లకూరు: తమ గ్రామానికి దారి చూపాలని నాంచారమ్మపేట వాసులు తహసీల్దార్ శ్రీనివాసులుకు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వే నంబర్ 405, 406, 407, 409, 429లో బండి బాట ఉండేదని, ఇటీవల రియల్ ఎస్టేట్ వ్యాపారులు దారిని ఆక్రమించుకుని దారి మూసివేశారని అన్నారు. సర్వే చేసి దారి ఇప్పించాలని గ్రామస్తులు కోరారు. తహసీల్దార్ మాట్లాడుతూ సర్వే చేయించి న్యాయం చేస్తామని చెప్పారు.

కండలేరులో 11.776 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో శుక్రవారం నాటికి 11.776 టీఎంసీ నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్‌రెగ్యులేటర్ నుంచి సత్యసాయి గంగ కాలువకు 265 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 5, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 5, లోలెవల్ స్లూయిస్‌కు 15 క్యూసెక్కుల వంతున విడుదల చేస్తున్నట్లు చెప్పారు.

అందరికీ ఆరోగ్యం..అదే సురక్ష లక్ష్యం



గూడూరురూరల్: మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు



సైదాపురం: మందులు పంపిణీ చేస్తున్న వైద్యసిబ్బంది

గూడూరురూరల్: పేదలందరికీ సంపూర్ణ ఆరోగ్యం చేకూర్చాలన్నదే జగనన్న సురక్ష కార్యక్రమం లక్ష్యమని ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్‌రావు అన్నారు. గూడూరులో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు మాట్లాడుతూ సీఎం జగన్ మోహన్‌రెడ్డి వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. ఇందులో భాగంగానే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం అమలు చేసి, వైద్యశిబిరాలను ఏర్పాటు చేసి అన్ని వ్యాధులకు పరీక్షలు చేయిస్తున్నారన్నారు. అలాగే ఉచితంగా మందులు పంపిణీ చేస్తారన్నారు. ఈ సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకులు కే మీరారెడ్డి, బీ శ్రీనివాసులు, ఎం చంద్రమోహన్‌రెడ్డి, కృష్ణయ్య, రమేష్ యాదవ్, సర్పంచ్ ఈ శీనయ్య, గోపాల్, అజీజ్‌ఖాన్, గురుస్వామి, టీ లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరం

సైదాపురం: జగనన్న ఆరోగ్య సురక్ష రోగుల పాలిట వరమని నెల్లూరు జిల్లా జెడ్పీ సీఈఓ చిరంజీవి అన్నారు. మండలంలోని రామసాగరం ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సర్పంచ్ ఎం వెంకటరత్నమ్మ అధ్యక్షతన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, వైద్యులు జనార్దన్, శ్రీధర్, సీడీపీఓ సునంద, జేసీఎస్ కన్వీనర్ శ్రీనివాసులు రాజు, ఎంపీటీసీ సభ్యుడు నాగరాజు, నేతలు రాజశేఖర్‌నాయుడు, పార్థసారథి పాల్గొన్నారు.

విశేష స్పందన

రాపూరు: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి విశేష స్పందన లభించిందని జెడ్పీ సీఈఓ చిరంజీవి అన్నారు. రాపూరు మండలం గోనుపల్లెలో శనివారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు నర్మదదేవి, మమత, మధుసూదన్‌రావు, సూర్యధర్మేంద్ర, సుదర్శనమ్మ, సర్పంచ్ నారాయణమ్మ, మాజీ సర్పంచ్ శివకుమార్‌రెడ్డి, ఎంపీడీఓ అప్పాజీ, తహసీల్దార్ ప్రసాద్ పాల్గొన్నారు.



రాపూరు: పరీక్షలు చేయించుకున్న వ్యక్తికి కేస్ షీట్, మందులు ఇస్తున్న జెడ్పీ సీఈఓ చిరంజీవి

సూళ్లూరుపేట మండలంలో..

సూళ్లూరుపేట రూరల్: మండలంలోని దామానెల్లూరు, దేగావారికండ్రిగ, మన్నేముతేరి, ఆబాక గ్రామాల్లో శనివారం వైద్య సిబ్బంది సర్వే చేసి, రోగులను గుర్తించి వివిధ పరీక్షలు చేశారు. జగనన్న ఆరోగ్య సురక్షపై అవగాహన కల్పించారు.

ముమ్మరంగా సురక్ష

దొరవారిసత్రం: మండలంలోని దొరవారిసత్రం, తొగరాముడి పీహెచ్‌సీ పరిధిలోని పలు గ్రామాల్లో శనివారం ఇంటింటికీ వెళ్లి వైద్య సిబ్బంది సర్వే చేపట్టారు.

సంపూర్ణ ఆరోగ్యం

పెళ్లకూరు: ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని అమలు చేస్తుందని జెడ్పీటీసీ సభ్యురాలు నన్నం ప్రిస్కిల్లా అన్నారు. శనివారం తాళ్వాయిపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమానికి పలు ప్రాంతాల నుంచి వ్యాధిగ్రస్తులు వైద్య పరీక్షలు చేయించుకుని, వైద్య సేవలు పొందారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కుమారి కల్పన, మండల ఉపాధ్యక్షురాలు సుధారాణి, ఏఎంసీ ఉపాధ్యక్షుడు బాలసుబ్రమణ్యం, ఎంపీటీసీ సభ్యుడు కృష్ణయ్య, ఎంపీడీఓ సురేష్‌బాబు పాల్గొన్నారు.



పెళ్లకూరు: మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యురాలు ప్రిస్కిల్లా

మన్నారుపోలూరులో..

సూళ్లూరుపేట: మన్నారుపోలూరులో జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా శనివారం మెడికల్ క్యాంప్ నిర్వహించారు. సుమారు 300 మంది వైద్య శిబిరానికి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మధులిక, దివ్యయాదవ్, సునీలా కుమారి తదితరులు పాల్గొన్నారు.

వంజివాకలో..

కోట: మండలంలోని వంజివాకలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం జరిగింది. టోకన్లు ఇచ్చిన వారికి వైద్యసేవలు అందజేశారు. ఎంపీపీ దాసరి అంజమ్మ, తహసీల్దార్ పద్మావతి, ఎంపీడీఓ భవానీ, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ హనుమంతరావు పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థికి పసిడి పతకం



పతకాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్

చిల్లకూరు: బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో చదువుతున్న విద్యార్థి డానియల్ కుస్తీ పోటీలు ఫ్రీస్టైయిల్ విభాగంలో బంగారు పతకం సాధించాడని ప్రిన్సిపల్ మీరా సాహెబ్ తెలిపారు. చిల్లకూరులోని గురుకుల కళాశాలలో విద్యార్థి డానియల్‌ను అభినందించారు. ఆయన మాట్లాడుతూ కళాశాలలో చదువుతున్న డానియల్ 71 కిలో విభాగంలో కృష్ణాజిల్లా నున్నలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో విజయం సాధించి, బంగారు పతకం దక్కించుకున్నాడని తెలిపారు. దీంతో మధ్యప్రదేశ్‌లో జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం దక్కించుకున్నాడన్నారు. అలాగే రాష్ట్రస్థాయి కుస్తీ పోటీలు 51 కిలోల విభాగంలో డీ గోపించంద్ రజితం, 48కిలోల విభాగంలో డీ హజరత్తయ్య కాంస్య పతకం, 71 కిలోల విభాగంలో నందకిషోర్ రజిత పతకం సాధించారన్నారు. విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన పీఈటీ శ్రీరేష్‌ను ఆయన అభినందించారు.

క్విజ్ పోటీల్లో మెట్టు విద్యార్థుల ప్రతిభ

చిట్టమూరు: మండల స్థాయి క్విజ్ పోటీల్లో మెట్టు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి, మొదటి స్థానంలో నిలిచారు. చంద్రయాన్–3పై శనివారం ఎమ్మార్సీలో మండలంలోని అన్ని పాఠశాలల్లో ఆరు నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మెట్టు పాఠశాకు చెందిన విద్యార్థులు నరహరి, సింధు, చక్రధర్ మొదటి మూడు స్థానాలు సాధించారు. చిత్రలేఖనం పోటీల్లో ఈశ్వరవాక జెడ్పీ హైస్కూల్‌కు మొదటి స్థానం, రెండో స్థానంలో మెట్టు, మూడో స్థానంలో యాకసిరి విద్యార్థి సాధించారని ఉపాధ్యాయులు తెలిపారు.



క్విజ్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన మెట్టు విద్యార్థులు

ఈ కార్యక్రమంలో ఎంఈఓ కృష్ణయ్య, మెట్టు హెచ్‌ఎం పార్థసారథి, ఉపాధ్యాయుడు రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

వేడుకగా పల్లకీ సేవ

చిల్లకూరు: మండలంలోని కలవకొండలో ఉన్న లక్ష్మీనరసింహస్వామికి శనివారం పల్లకీసేవ వేడుకగా నిర్వహించారు. ఉదయం స్వామి అమ్మవార్లకు నిత్యకైంకర్యాలు నిర్వహించి, భక్తులు దర్శనం కల్పించారు. అన్న ప్రసాదాలు వితరణ చేశారు. ఈ కార్యక్రమానికి గూడూరుకు చెందిన పొన్నూరు కిషోర్ దంపతులు, పల్లకీ సేవకు గూడూరుకు చెందిన ముప్పాళ్ల శ్రీనివాసులరెడ్డి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమాలను ఆలయ ఈఓ నవీన్‌కుమార్, ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ కందల ఆనంద్ పర్యవేక్షించారు.



పల్లకిలో ఊరేగుతున్న లక్ష్మీనరసింహస్వామి

పౌరహక్కులపై అవగాహన అవసరం

చిల్లకూరు: సమాజంలో ప్రతి పౌరుడు పౌరహక్కులపై అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఉందని తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని తిప్పగుంటపాళెంలో శనివారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాజ్యాంగంలో ప్రజల హక్కులు గురించి పేర్కొని ఉన్నారన్నారు. వీటిని అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వం, అధికారులపై ఉంటుందని చెప్పారు. అయితే ఆ హక్కులు ఏమిటనే విషయాలను ముందుగా సామాన్య ప్రజలు తెలుసుకోవాలనే సంకల్పంతో ఇలా అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ నిర్మలాదేవి, ఏపీఓ గిరి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విజయకుమార్ సర్పంచ్ వై సుకన్య, నాయకులు సనత్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

హక్కులు వినియోగించుకోవాలి

దక్కిలి(బాలాయపల్లె): ప్రతి పౌరునికి రాజ్యాంగం కొన్ని హక్కులను కల్పించిందని వీటిని వినియోగించుకోవాలని తహసీల్దార్ శ్రీనివాసులు అన్నారు. మండలంలోని అక్కసముద్రం ఎస్టీ కాలనీలో శనివారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని, తద్వారా ప్రభుత్వం అందిస్తున్న అన్ని సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సీహెచ్ రవీంద్రబాబు, ఎంఈఓ ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.



చిల్లకూరు: పౌరహక్కుల దినోత్సవంలో పాల్గొన్న అధికారులు

పంబలిలో..

వాకాడు: మండలంలోని పంబలిలో శనివారం రెవెన్యూ అధికారులు పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. తహసీల్దార్ నరసింహారావు, ఎంపీడీఓ గోపీనాథ్, ఆర్‌ఐ సెల్వ, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుల నియామకం

తిరుపతి కల్చరల్: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ మండల అధ్యక్షులను నియమించారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం మండల అధ్యక్షుల జాబితాను ప్రకటించింది. వెంకటగిరి, సూళ్లూరుపేట నియోజకవర్గాల పరిధిలో పార్టీ మండల అధ్యక్షుల వివరాలిలా ఉన్నాయి. వెంకటగిరి మున్సిపాలిటీ అధ్యక్షుడిగా ఢిల్లీ బాబు, వెంకటగిరి రూరల్ మండలం శ్రీనివాసులురెడ్డి, బాలాయపల్లె కార్తీక్ రెడ్డి, డక్కిలి పీ జగన్‌మోహన్, రాపూరు పీ దయాకర్‌రెడ్డి, సైదాపురం రవియాదవ్, కలువాయి ఎం కృష్ణారెడ్డి నియమితులయ్యారు. అలాగే సూళ్లూరుపేట మున్సిపాలిటీ అధ్యక్షుడికిగా శేఖర్‌రెడ్డి, సూళ్లూరుపేట రూరల్ మండల అధ్యక్షుడిగా అనిల్‌రెడ్డి, నాయుడుపేట మున్సిపాలిటీ షేక్ రఫీ, పెళ్లకూరు ఓ వెంకటరత్నం, దొరవారిసత్రం శ్రీనివాస్, ఓజిలి పదర్తి హరనాథ, తడ మండల అధ్యక్షుడిగా ఆర్ముగం నియమితులయ్యారు.

చందనాలంకారంలో వెంకన్న

సూళ్లూరుపేట: పట్టణంలోని వేంకటేశ్వరాలయంలో పెరటాసి నెల (తమిళనెల)రెండో శనివారం సందర్భంగా స్వామివారికి కస్తూరి చందనాలంకారం చేసి, భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు అన్నదానం చేశారు.

మంచి ప్రాజెక్టులు తయారు చేయండి



మాట్లాడుతున్న డీవైఈఓ శివప్రకాష్‌రెడ్డి

గూడూరురూరల్: జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ కోసం విద్యార్థులతో మంచి ప్రాజెక్టులు తయారు చేయించాలని గూడూరు డిప్యూటీ డీఈఓ శివప్రకాష్‌రెడ్డి కోరారు. గూడూరు జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం తిరుపతి జిల్లాలో ఆప్‌కాస్ట్ ఆధ్వర్యంలో జరిగే జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ ప్రదర్శనకు సంబంధించి ప్రాజెక్టుల తయారీపై ఒక రోజు డివిజన్ స్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా అకడమిక్ సైన్స్ కోఆర్డినేటర్ కోదండపాణి, ఆప్‌కాస్ట్ జిల్లా రిసోర్స్‌పర్సన్లు మేఘనాథ్, రాజేష్, శ్రీరామమూర్తి, వేణు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని మహిళ మృతి

నాయుడుపేటటౌన్: పట్టణంలోని శ్రీకాళహస్తి బైపాస్‌రోడ్డు వద్ద శుక్రవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వాహనం ఢీ కొని, ఓ మహిళ మృతి చెందింది. పోలీసుల కథనం మేరకు.. పట్టణంలోని భూపయ్య కాలనీకి చెందిన కేతంగారి దేవి, చిన్నా దంపతులు కూలి పనులు చేసుకుంటు జీవనం సాగిస్తున్నారు. శుక్రవారం రాత్రి దేవి పట్టణంలోని జువ్వలపాళెం రోడ్డు వద్ద ఉన్న బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి ఇంటికి వెళుతూ రహదారిపై నడిచి వెళుతుండగా గుర్తు తెలియని వాహనం ఆమెను ఢీకొని, ఆమె శరీరం పైనుంచి వెళ్లిపోయింది. దీంతో ఆమె మృతదేహం ఛిద్రమైంది. సమాచారమందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. గుర్తు తెలియని వాహనం ఢీకొని మహిళ మృతి చెందినట్లు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

3న మండల మీట్

చిట్టమూరు: మండల సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ షాలెట్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు తప్పక హాజరుకావాలని కోరారు.

నేత్రపర్వంగా రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు, (ఇన్‌సెట్) రథంలో ఊరేగుతున్న స్వామి, అమ్మవార్లు

చిట్టమూరు: మల్లాం గ్రామంలోని శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారికి రథోత్సవం నేత్రపర్వంగా నిర్వహించారు. స్వామివారు లోక కల్యాణార్థం మల్లాసుర, కొల్లాసుర రాక్షసులను సంహరణ అనంతరం విజయోత్సవానికి చిహ్నంగా రథంపై ఊరేగారు. దీంతో మల్లాం గ్రామం భక్తులతో కిక్కిరిసి పోయింది. సుబ్రహ్మణ్యేశ్వరస్వామి నామస్మరణతో గ్రామం మార్మోగింది. వివాహం కానీ యువతీ యువకులు రథాన్ని లాగి తమకు వివాహాలు జరగాలని స్వామివారిని మొక్కుకున్నారు. అలాగే అనారోగ్యంతో బాధపడేవారు స్వామివారి తేరుపై మిరియాలు, ఉప్పు చల్లి తమ రుగ్మతలు తొలగిపోవాలని స్వామివారిని వేడుకున్నారు. స్వామివారి రథం గ్రామంలో తమ ఇళ్లముందుకు రాగానే గ్రామస్తులు కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమాలను ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ సాయికుమార్ రెడ్డి, ఈఓ శశాంక్, గ్రామపెద్దలు పర్యవేక్షించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి షణ్ముఖస్వామి కల్యాణం నిర్వహించనున్నారు.



కొబ్బరికాయలు కొడుతున్న గ్రామస్తులు

ఉద్యోగాలకు 60 మంది ఎంపిక

సూళ్లూరుపేట: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీకళాశాలలో శనివారం నిర్వహించిన జాబ్‌మేళాలో 60 మంది నిరుద్యోగులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. శ్రీసిటీ సెజ్‌లోని ప్రముఖ బీఎంఎస్ సర్వీసెస్ కంపెనీ హెచ్‌ఆర్ రమణ ఆధ్వర్యంలో బ్లూస్టార్, హావెల్స్, పానోనిక్ కంపెనీల్లో పని చేసేందుకు నిర్వహించిన జాబ్‌మేళాకు సుమారు వందమంది హాజరయ్యారు. ఈ ఇంటర్వ్యూల్లో 60 మంది ప్రతిభ చూపి, ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ఎల్‌బీ శంకరశర్మ, జేకేసీ కోఆర్డినేటర్ డాక్టర్ జీకే ప్రసాద్, జేకేజీ మెంటార్ ఎస్ యామినిశైలజ తదితరులు పాల్గొన్నారు.



జాబ్‌మేళాకు హాజరైన నిరుద్యోగులు

పౌష్టికాహారంతో రక్తహీనత నివారణ

దక్కిలి: మంచి పౌష్టికాహారంతో రక్తహీనతను నివారించవచ్చని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పరిమళ తెలిపారు. పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా శనివారం మండలంలోని డీవడ్డిపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహారం అవశ్యకతపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కార్యకర్త చెంచుకళ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఆకు కూరలు, కూరగాయలు, చిరుధాన్యాలతో ప్రదర్శన ఏర్పాటు చేసి గర్భిణులు, బాలింతలుకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు రాజేశ్వరి, సుకన్య, కోటేశ్వరమ్మ, రత్నమ్మ, ప్రసన్న, సుబ్బమ్మ, కామేశ్వరి, రాఘవమ్మ పాల్గొన్నారు.



పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న కార్యకర్తలు

బాధిత కుటుంబానికి అండగా నిలుస్తాం

సైదాపురం: బాధిత కుటుంబానికి అండగా నిలుస్తామని ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్‌నాయక్ తెలిపారు. మండలంలోని పాలూరు రాజుపాళెంలో 5 నెలలు క్రితం పురుగుల మందు తాగి మృతి చెందిన యల్లంపల్లి పెంచలయ్య కుటుంబ సభ్యులను శనివారం ఆయన పరామర్శించారు. తన భర్త మృతిపై పలు అనుమానాలు ఉన్నాయని పెంచలయ్య భార్య భారతి ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేయడంతో సమగ్ర విచారణ చేసేందుకు క్షేత్ర స్థాయిలో విచారణ చేపట్టారు. కమిషన్ సభ్యులు శంకర్‌నాయక్ మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి, పిల్లలను ఉన్నత చదువులు చదివించాలని కోరారు. మృతుని కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. అనంతరం అధికారులు, ప్రజలు, బాధిత కుటుంబ సభ్యుల సమక్షంలో విచారణ చేపట్టారు. మృతుడు ఎలా చనిపోయారన్న వాస్తవ పరిస్థితులపై సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆయన డీఎస్పీ కోటారెడ్డికి సూచించారు. నెలలు గడుస్తున్నా విచారణ ఎందుకు ఆలస్యం అయిందని ప్రశ్నించారు. పోస్టుమార్టం చివరి నివేదిక ఆలస్యం అయ్యిందని, వారంలోగా పూర్తిస్థాయి నివేదిక ఇస్తామని ఎస్‌ఐ చల్లా వాసు తెలిపారు. ఆయన వెంట రాపూరు సీఐ సుబ్రమణ్యం తహసీల్దార్ శ్రీనివాసులు, నేతలు పెంచలయ్య, వెంకటేశ్వర్లు ,ఎంపీటీసీ సభ్యుడు ఈశ్వరరాజు తదితరులున్నారు.



కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న శంకర్‌నాయక్

సైదాపురం పీఎస్ తనిఖీ

సైదాపురం: మండల కేంద్రంలోని పోలీసుస్టేషన్‌ను శనివారం ఆత్మకూరు డీఎస్పీ కోటారెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించారు. అనంతరం ఆయన పలు కేసుల విషయమై సీఐ సుబ్రమణ్యం, ఎస్‌ఐ వాసులతో చర్చించారు.



మాట్లాడుతున్న డీఎస్పీ కోటారెడ్డి

3న స్పాట్ అడ్మిషన్లు

గూడూరురూరల్: పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో 2023–24 విద్యాసంవత్సరంలో మిగిలిన సీట్ల భర్తీకి అక్టోబర్ 3వ తేదీన స్పాట్ అడ్మిషన్లు జరుగుతాయని కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ ఎస్.భవాని శంకర్ తెలిపారు. సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, మైనింగ్ ఇంజినీరింగ్ విభాగాల్లో మిగిలిన సీట్ల భర్తీకి రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ స్పాట్ అడ్మిషన్ల భర్తీ నోటిఫికేషన్ జారీ చేసిందన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులై పాలిసెట్–2023 క్వాలిఫై అయిన, కాని వారు, ఎంట్రన్స్ రాయని వారు కూడా అర్హులన్నారు. వివరాలకు 9912322600, 9989085540, 91218 78042, 9030229199 నంబర్లలో సంప్రదించాలన్నారు.

బంగారు చైన్ చోరీ

నాయుడుపేటటౌన్: పట్టణంలోని టీచర్స్ కాలనీలో నివాసం ఉన్న దువ్వూరు గీతా అనే మహిళ మెడలో సుమారు 5 సవర్ల బంగారు చైన్ లాక్కెళ్లిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. టీచర్స్ కాలనీకి చెందిన గీతా ఉద యం ఇంటి ముందు ముగ్గు వేసుకుంటోంది. ఆ సమయంలో ముఖానికి మాస్క్ ధరించి, నడిచి వెళుతున్న గుర్తు తెలియని వ్యక్తి గీతా మెడలో బంగారు చైన్ లాక్కొని, పరారయ్యాడు. ఆమె అరుపులు కేకలు వేయడంతో చుట్టు పక్కల వారు దొంగ కోసం గాలించినా ఆచూకీ తెలియలేదు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బీరు బాటిళ్ల స్వాధీనం



నిందితుడి అరెస్టు చూపుతున్న సెబ్ పోలీసులు

సూళ్లూరుపేట: స్థానిక సెబ్ పోలీసులు ప్రైవేట్ ట్రావెల్ బస్సులో తరలిస్తున్న బీరు బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. సెబ్ పోలీసుల కథనం మేరకు.. స్థానిక సెబ్ సీఐ సూర్యనారాయణ తన సిబ్బందితో శనివారం సూళ్లూరుపేట టోల్‌ప్లాజా వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో హైదరాబాద్ నుంచి చెన్నై వెళుతున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులో తెలంగాణకు చెందిన 15 బీరు బాటిళ్ల ఉండడాన్ని గుర్తించారు. బీరుబాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. చెన్నైకు చెందిన ఆర్ యువరాజ్ అనే వ్యక్తి అదుపులోకి తీసుకుని, కేసు దర్యాప్తు చేస్తున్నారు.